క్లుప్తంగా

ఘనంగా భీమన్న జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

నేరడిగొండ: మండల కేంద్రంతో పాటు కుమారి, కొర్టికల్(బి), వడూర్, బుగ్గారం గ్రామాల్లో ఆదివారం భీమన్న జాతరను ఘనంగా నిర్వహించారు. జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు డప్పువాయిద్యాలు, బజాభజంత్రీలతో భీమన్న దేవుడి ఆలయానికి చేరుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

'రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు'

బజార్‌హత్నూర్: రబీ పంటల కొనుగోలు విషయంలో ప్రైవేట్ వ్యాపారులు రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని దేగామ గ్రామంలో ప్యాక్స్ సబ్‌సెంటర్ పరిశీలనకు వచ్చిన సందర్భంగా జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్ ఆయనను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పోరెడ్డి నారాయణ, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, పోతన్న, సామన్‌పల్లి శేఖర్, కిషన్, విఠల్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ప్రవీణ్‌రెడ్డి

బేల: యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాలాయితండా గ్రామంలో సేవాలాల్ స్మారక మెగా టోర్నమెంట్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఇన్‌చార్జి రాథోడ్ బాలాజీ, ఆయా పార్టీల నాయకులు శ్యాంరావు, రాథోడ్ దినేష్, గోపాల్, చౌహన్ రాహుల్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

బోథ్: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మండలంలోని పట్నాపూర్ గ్రామంలో కొనసాగుతున్న వాలీబాల్ పోటీలను ఆదివారం తిలకించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన వెంట న్యాయవాది పంద్రం శంకర్, ఎంపీటీసీ మహేందర్, అబూద్, ఆడెం పొల్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బొడ్డు గంగారెడ్డిని స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. రైతుల పక్షాన నిలవాలని కోరారు.

కమిషనర్‌ను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎండీ.ఖమర్ అహ్మద్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. రానున్న వేసవి కాలంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్లు అజయ్, సంద నర్సింగ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలోని నూతనంగా నిర్మించిన శ్రీసీతా రామాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఆలయ ప్రాంగణంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం వేకువజామున శ్రీగోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదానంద్, ఆలయకమిటీ సభ్యులు మహేందర్, సంతోష్, కొడాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజుల్లో గడిపిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనాడు చదువు చెప్పిన గురువలను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే

- ఫైర్‌స్టేషన్ మంజూరులో పాలకుల నిర్లక్ష్యం
- కాలిబూడిదవుతున్న ఆస్తులు
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు



బోథ్ మండల కేంద్రంలో కాలిపోతున్న హోటల్ (ఫైల్)

బోథ్: జిల్లాలోని పలు మండలాల్లో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరిగితే ఆస్తులు బూడిద కావాల్సిందే. ప్రతీ వేసవిలో అగ్నిప్రమాదాల వల్ల బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేయకపోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారు. ఫైరింజన్ ఘటన స్థలానికి చేరుకునే లోపు పూర్తిగా కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేవలం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం, ఇచ్చోడ, ఉట్నూర్‌లో మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి.

మూడు మాత్రమే..

జిల్లాలో 18 మండలాలు ఉండగా.. ఇచ్చోడ, ఆదిలాబాద్, ఉట్నూర్ మండల కేంద్రాల్లో మాత్రమే అగ్నిమాపక స్టేషన్లు ఉన్నాయి. బోథ్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదు. అయితే మూడేళ్ల క్రితం నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలాల్లో ప్రభుత్వం ఫైర్ స్టేషన్లు మంజూరు చేసింది. అయితే ఇప్పటి వరకు వాటికి సంబంధించిన నిర్మాణాలు జరగలేదు.

జిల్లాలో అగ్ని ప్రమాదాలు కొన్ని..

- బోథ్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతంతో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. రూ. 5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.
- బోథ్ మండల కేంద్రంలో ఓ జిన్నింగ్ మిల్లులో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని రూ. 20 లక్షల పత్తి అగ్నికి ఆహుతైంది.
- బోథ్ మండలంలోని నీటిపారుదల కార్యాలయంలో మిషన్ భగీరథ పైపులు అగ్నికి ఆహుతై రూ. 30 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది.
- బోథ్‌లోని న్యూకాలనీలో ఇల్లు కాలి బూడిదయ్యింది.
- బజార్‌హత్నూర్ మండలంలోని చందునాయక్‌తండాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. రెండు ఆటోలు, ఒక బైక్ కాలిపోయింది.
- గత ఏడాది ఏప్రిల్‌లో హోటల్, న్యూ కాలనీలోని ఓ ఇల్లు కాలిబూడిదయింది.
- బోథ్ మండలంలోని కుచులాపూర్ ఓ ఇల్లు అగ్నికి ఆహుతైంది. పూర్తిగా కాలిపోయిన తరువాత ఫైర్ ఇంజన్ గ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బోథ్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇల్లు పూర్తిగా కాలిపోయింది



మూడేళ్ల క్రితం మా ఇల్లు కాలిపోయింది. ఇల్లు పూర్తిగా కాలిన తరువాత ఇచ్చోడకు చెందిన ఫైర్ ఇంజన్ వచ్చింది. ఫైర్ ఇంజన్ వచ్చే లోపు ఇళ్లు పూర్తిగా తగలబడిపోయింది. దాదాపు రూ. 13 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. మాకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి.

– దాసరి గంగయ్య, బోథ్

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



బోథ్ మండలంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో విన్నవించాను. ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాధానంగా జిల్లా అగ్నిమాపక అధికారి నుంచి సమాధానం వచ్చింది. జిల్లాలో అవసరమైన చోట ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే అగ్ని ప్రమాదాల తీవ్రత తగ్గే అవకాశం ఉంది.

– బోనగిరి కిరణ్ కుమార్, బోథ్

వెంటనే స్పందిస్తున్నాం



జిల్లాలో ఆదిలాబాద్, ఉట్నూర్, ఇచ్చోడలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే స్పందిస్తున్నాం. జిల్లాలోని బోథ్ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం గతంలో ప్రభుత్వానికి నివేదించాం. ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– కేశవులు, జిల్లా అగ్నిమాపక అధికారి

ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు



దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

- లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఆరు గ్యారంటీలలో వీటికే ఎక్కువ దరఖాస్తులు

ఇచ్చోడ: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకాన్ని ఆధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీని స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టింది. ఆరు గ్యారెంటీల అమలులో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు పెట్టుకున్నారు.

పోటీ పడి దరఖాస్తులు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లులేని పేదలు ఎంత మంది ఉన్న దరఖాస్తు చేసుకోవాలని ప్రకటిచింది, దీంతో పేదలంతా పోటీ పడి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇంటి స్థలం ఉండి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించింది.

మంజూరు కోసం ఎదురుచూపులు..

ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు మంజూరు కోసం మూడు నెలల నుంచి ఎదురు చూస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకటన చేయలేదు. ఇళ్ల నిర్మాణం పనులు కేవలం వేసవి కాలంలో మార్చి నుంచి మే నెల వరకు మాత్రమే నిర్మించుకునే అవకాశం ఉంటుంది. వేసవి ముగియడంతో వర్షకాలంలో రైతులు, పేదలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. దీంతో ఇందిరమ్మ లబ్ధిదారులు మంజూరు కోసం ఎదురుచూడక తప్పడం లేదు.

వచ్చిన దరఖాస్తులు..

మండలం	గ్రామాలు	దరఖాస్తులు
బజార్‌హత్నూర్	30	550
భీంపూర్	26	847
బోథ్	33	789
గుడిహత్నూర్	26	450
నేరడిగొండ	32	390
తలమడుగు	28	798
తాంసి	13	240
ఇచ్చోడ	32	730
సిరికొండ	19	354
మొత్తం	239	5148

నిధులు మంజూరు చేయాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణల కోసం నిధులు మంజూరు చేయాలి. పేదలకు ఇళ్లు లేక నాన అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలి.

– మాధవ్, ముఖరా(కె), ఇచ్చోడ మండలం

విధివిధానాలు ప్రకటించాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణల కోసం ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించాలి. ఇంటి నిర్మాణాల ప్రకియ వేగవంతం చేయాలి. మూడు నెలల తరువాత ఇంటి నిర్మాణాలు చేసుకోలేం. దరఖాస్తులను పరిశీలించాలి.

– భీంరావు, నర్సాపూర్, ఇచ్చోడ మండలం

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం



మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానందం

నేరడిగొండ: బీజేపీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పోలింగ్ బూత్ కమిటీలను బలపర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎవరైనా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీని అత్యధిక మెజార్టీతో గెలిపించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుడు, వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలి

ఇచ్చోడ: కార్యకర్తలు కలిసి కట్టుగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ప్రారంభించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్ర నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కదం బాబారావ్ మాధవ్ అమ్టె, గుమ్మడి భీమ్‌రెడ్డి, కొల్లూరి చంద్రశేఖర్, రమేశ్, మచ్చ అజయ్, గోతి సునీల్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఇచ్చోడ: మండల కేంద్రానికి సోమవారం బోథ్ ఎమ్మెల్యే రానున్నట్లు సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సోయా కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు



పల్సి(బి)తండాలో బోరుబావిని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

తలమడుగు: గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. మండలంలోని పల్సి(బి)తండాలో ఏర్పాటు చేసిన బోరుబావిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో 15 ఫైనాన్స్ ద్వారా ప్రతీ గ్రామంలో బోరు బావులను ఏర్పాటు చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీరు రావడం లేదని మండిపడ్డారు. కేవలం మిషన్ భగీరథ పథకం కమిషన్ల కోసం అని ఆరోపించారు. తలమడుగు మండలం పల్సి(బి)తండా గ్రామంలో నీటి సమస్యతో గ్రామస్తులు బాధపడుతున్నారని తెలుసుకొని జెడ్పీ 15వ ఫైనాన్స్ నిధులు రూ.1 లక్ష 50వేలతో బోరు వేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణ్, లక్ష్మి, రాజేశ్వర్, మాజీ సర్పంచ్ అంగూర్, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, గ్రామస్తులు మణిరాం, కిషన్ మహరాజ్, చల్ల దేవన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా హీరాసుక జయంతి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకలను ఆదివారం హీరాసుక జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిర్వహించిన వేడుకల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులతో కలిసి హీరాసుక చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో ఆదివాసీ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుకుంటూ.. భావితరాలకు అందించావాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం హీరాసుక జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అక్కడే ఉన్న రాంజీగోండ్, కుమ్రం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హీరాసుక జాగృతి అధ్యక్షుడు సిడం రాంకిషన్, ఆదివాసీ పర్ధాన్ సమాజ్ పెద్దలు మెస్రం క్రిష్ణ, దుర్వ నగేశ్, గేడం జనార్ధన్, గేడం మాధవ్, కుర్సేంగే తానాజీ, కుర్సేంగే యాదవ్ రావ్, గేడం మనోహర్ పాల్గొన్నారు.

'రైతులను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన కానుకగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం రెండు నెలలు అవుతున్నా.. ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు.రైతులు పండించిన సోయాబీన్ 70 నుంచి 80 క్వింటాళ్ల వరకు విక్రయించిన తరువాత మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని మండిపడ్డారు. కందులు, శనగ పంటలు రైతుల చేతికి వచ్చాయని, ఇప్పటి నుంచే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు విజ్జగిరి నారాయణ, మార్కెట్ మాజీ చైర్మన్ కుమ్ర రాజు, కౌన్సిలర్ వేణుగంటి ప్రకాష్, నాయకులు ఆనంద్, నవతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్మానం

నేరడిగొండ: మండలంలోని మాదాపూర్ గ్రామ ప్రజలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పటేల్, దేవరి మహాజన్, తదితరులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: బీజేపీ అనుబంధ విభాగమైన ఆదిలాబాద్ మహిళా మోర్చా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన స్వప్న నియమాకమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలంలో ఆదివారం ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం



తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపక్కన చెత్తాచెదారం

ఇచ్చోడ: ఇచ్చోడ మెజార్ పంచాయతీ పరిధిలో రోడ్లపై చెత్త కంపు కొడుతోంది. పారిశుధ్య కార్మికులకు గత మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో పనులకు హాజరు కావడం లేదు. దీంతో రోడ్లపై ఎక్కడిక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహనీయుల ఆలోచనతో ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ మహనీయులు ఆలోచనలతో ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మినగర్‌లో నిర్వహించిన సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బలహీన వర్గానికి చెందిన సంత్ రవిదాస్ సమాజాన్ని ఉత్తేజపర్చేలా చైతన్యం తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఆధ్యాత్మికత ద్వారా సన్మార్గానికి దారి చూపారని అన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం పేరు మార్చి ప్రజలను మోసం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేసేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రఘునాథ్, సంజయ్, సంతోష్, సందీప్, రవి, పొచ్చన్న, ముకుంద్, తదితరులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ చూపిన బాటలో పయనించాలి..

సంత్ రవిదాస్ చూపిన బాటలో పయనించాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని చిల్కూరి లక్ష్మినగర్ సంఘ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంత్ రవిదాస్ పుణ్యతిథి కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంత్ రవిదాస్ మానవ హక్కులు, సమానత్వంపై ఎన్నో రచనలు చేసి జాగృతం చేశారని పేర్కొన్నారు.

'రాజకీయాల్లో కక్ష సాధింపు ఉండొద్దు'



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: రాజకీయ నాయకుడికి కక్షసాధింపు ధోరణి ఉండకూడదని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఓటు వేసిన వారు, వేయని వారు అందరూ తన ప్రజలేనని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ. 3 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కక్ష సాధింపు ధోరణి వ్యవహరిస్తూ అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని లాండసాంగ్విలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తరోడా వంతెన కుంగిపోవడంతో గత్యంతరం లేకుండా గ్రామం నుంచి డబుల్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, కొండూరి రవి, ముకీమ్, సుదర్శన్, గజానంద్, విఠల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్: నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ట్రస్ట్ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగి ఆడే దిలీప్, న్యాయవాది వినోద్ రెడ్డి పాల్గొని పేదలకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, సలీమ్, సుభాష్, అంబయ్య, శేఖర్, రాజయ్య పాల్గొన్నారు.